క్లుప్తంగా

నున్న మ్యాంగో మార్కెట్‌లో అగ్నిప్రమాదం



నున్న(విజయవాడ రూరల్): నున్న గ్రామంలోని మ్యాంగో మార్కెట్‌లో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇగుటూరి శ్రీనివాస రెడ్డికి చెందిన మామిడికాయల షాపు కాలిపోయింది. సంక్రాంతి పండుగ కావడంతో షాపు వద్ద ఉండవలసిన వారు ఎవ్వరూ లేకపోవడంతో మంటలకు షాపు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యింది. సమీపంలోని వారు మంటలను గమనించి పాయకాపురంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక కేంద్రం అధికారి ఎస్. రమేష్ సిబ్బంది అక్కడకు వచ్చి మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదంలో జనరేటర్, మామిడికాయల ట్రేలు, షెడ్డు పూర్తిగా కాలిపోయినట్లు అగ్నిమాపక కేంద్రం అధికారి ఎస్. రమేష్ తెలిపారు. ఈ ప్రమాదంలో 5 లక్షల రూపాయల నష్టం సంభవించిందన్నారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: యనమలకుదురులో వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురుకు చెందిన పి.వెంకటరమణ, భర్త ఫణికుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. ఆమె తల్లి పసుపులేటి విజయలక్ష్మి(55) అదే గ్రామంలో వెంకటరమణ ఇంటి సమీపంలో ఉంటుంది. వెంకటరమణ, ఆమె భర్త ఆఫీసుకు వెళ్లిన సమయంలో వారి మూడేళ్ల కుమారుడిని తల్లి విజయలక్ష్మి చూస్తుంది. కాగా ఈ నెల 13న విజయలక్ష్మి రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కంకిపాడు: పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఉత్సాహంగా జరిగింది. ప్రొద్దుటూరు జెడ్పీ పాఠశాలలో 1988వ సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థుల ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. పాఠశాల తరగతి గదులను కలియతిరిగి, గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మిత్రులను ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని సంతోషంగా గడిపారు. ఆత్మీయ సమావేశానికి రక్ష ఫౌండేషన్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ హాజరై గ్రామాభివృద్ధి, పాఠశాల అభివృద్ధి అంశాలపై చర్చించారు. కేవీఎస్ ప్రసాద్, నాగిరెడ్డి, కె.పూర్ణ, ఈడా నాగభూషణం, వాసుదేవరెడ్డి, కె.శ్రీను పాల్గొన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి కృషి



కంకిపాడు: క్రీడాకారుల సంక్షేమానికి కృషి చేస్తానని రక్ష ఫౌండేషన్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. వాలీబాల్ క్రీడాకారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. స్నిగ్ధ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, ఆరోగ్యం లభిస్తాయన్నారు. ఆసక్తిగల రంగాలను ఎంచుకుని ప్రతిభ చాటాలని సూచించారు. క్రీడాకారిణిగా క్రీడల పట్ల ఉన్న ఆసక్తితో క్రీడాకారుల సంక్షేమానికి పాటుపడతానన్నారు. పాఠశాల క్రీడా మైదానంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాక్, జిమ్ ఏర్పాటుతో క్రీడాభివృద్ధి సాధ్యమవుతుందని, ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని తెలిపారు. క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యతను పాఠశాల పీఈటీ రమేష్ వివరించారు.

క్యాలెండర్ పండుగకు విశేష స్పందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడంలో ఎల్లవేళలా ముందుండే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీ) సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని క్యాలెండర్ పండుగ పేరుతో కార్యక్రమం నిర్వహించింది. బందరు రోడ్డులోని ఐఓసీఎల్ పైలెట్ సర్వీస్ స్టేషన్ పెట్రోల్ బంక్ లో సోమవారం నిర్వహించిన క్యాలెండర్ పండుగకు విశేష స్పందన లభించింది. 800 మంది వినియోగదారులు తమ కుటుంబ సభ్యులతో తరలివచ్చి ఫొటోలు దిగారు. నిర్వాహకులు ఆ ఫొటోలను నూతన సంవత్సరం క్యాలెండర్‌లో ముద్రించి ఖాతాదారులకు అందజేశారు. సంస్థ అధిపతి ఎంవీవీ సత్యనారాయణ, నిమ్మరాజు చలపతిరావు, ఎన్టీఆర్ జిల్లా సేల్స్ ఆఫీసర్ వరప్రసాద్, సంస్థ మేనేజర్ వెంకటప్పయ్య, ఐఓసీ చీఫ్ డివిజనల్ రిటైల్ హెడ్ అనిల్‌కుమార్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు



గొడవర్రు బరిలో పందేలు వీక్షిస్తున్న ప్రజలు



ఈడుపుగల్లులో వాహనాల పార్కింగ్



యనమలకుదురులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

- ఇంటింటా వెల్లివిరిసిన ఆనందోత్సాహాలు
- గ్రామాల్లో పండుగ వాతావరణం

కంకిపాడు: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. సుదూర ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులు, బంధువులు గ్రామాల్లోని తమ ఇళ్లకు చేరుకోవడంతో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. కోడి పందేలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కోడిపందేల బరులు పందెంరాయుళ్లు, వీక్షకులతో కిటకిటలాడాయి. కోడిపందేలు, జూద శిబిరాలు పండుగ మూడు రోజులూ సాగాయి. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన పందెంరాయుళ్లు, వీక్షకులతో బరులు రద్దీగా మారాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా కంకిపాడు, గొడవర్రు, ఈడుపుగల్లు, ఉప్పులూరు గ్రామాల్లో ప్రత్యేకంగా బరులు సిద్ధం చేసి కోడిపందేలు, జూద క్రీడలు నిర్వహించారు. పందేలు అంటేనే గోదావరి జిల్లాలు గుర్తుకొస్తాయి. అలాంటిది కొన్ని సంవత్సరాలుగా సంక్రాంతి బరులు అంటే పెనమలూరు నియోజకవర్గం అనేలా ఇక్కడ ఏర్పాట్లు జరిగాయి. ప్రత్యేకంగా సిద్ధం చేసిన టెంట్లు, వీఐపీ గ్యాలరీలు, ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు, వీఐపీలకు అవసరమైన అతిథి సత్కారాలు వంటికి సమకూర్చారు. దీంతో రాష్ట్రం నలుమూలల నుంచి వీక్షకులు, పందెంరాయుళ్లు ఈ ప్రాంతానికి వచ్చి పండుగ వేళ బరుల్లో గడిపారు. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ ఆకునూరు, ముదునూరు, గొడవర్రు, ఈడుపుగల్లు బరులను సందర్శించారు. నిర్వాహకులను, పార్టీ శ్రేణులను కలుసుకున్నారు. ఈ ఏడాది కూడా గొడవర్రు బరి నిర్వాహకులు తమ ప్రత్యేకతను చాటుకున్నారు. 21 కోడిపందేల్లో 13 పందేలు గెలిచిన వెల్లటూరుకు చెందిన మధుకు స్విఫ్ట్ కారును బహుమతిగా అందించారు. నిర్వాహకులు కాగిత రాజా రమేష్‌తో కూడిన బృందం కారు తాళాలను విజేతకు అప్పగించారు.

సంప్రదాయంగా కోడి పందేలు

పెనమలూరు: సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా యనమలకుదురులో కోడిపందేలు నిర్వహించారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుంచి ప్రజలు తరలివచ్చి కోడి పందేలు తిలకించారు. మంత్రి జోగిరమేష్ సోమవారం రాత్రి కోడి పందేల శిబిరానికి వచ్చి అభిమానులతో మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ సంక్రాంతి పండుగను ఆనందంగా చేసుకోవాలని తెలిపారు. స్థానికులు మాట్లాడుతూ సంప్రదాయంగా కోడి పందేలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు యార్లగడ్డ వీరబాబు, యార్లగడ్డ నాగబాబు తెలిపారు. పెనమలూరు గ్రామంలోనూ కోడిపందేలు జరిగాయి.



ఈడుపుగల్లు బరి వద్ద ఆన్‌లైన్ చెల్లింపులకు ఏర్పాట్లు

యనమలకుదురులో సంబరాలు..

పెనమలూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా యనమలకుదురు గ్రామం శివలింగేశ్వర్‌నగర్‌లో సీపీఎం, ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆటల పోటీలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పేద, ధనిక తేడా లేకుండా అన్ని వర్గాల వారు ఆనందంగా జరుపుకుంటారన్నారు. మహిళలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి సంక్రాంతి పండుగను సందడిగా చేసుకుంటున్నామని తెలిపారు. ప్రజానాట్య మండలి కృష్ణా జిల్లా కార్యదర్శి షేక్.కాశిం మాట్లాడుతూ గ్రామంలో పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి వారిలో క్రమశిక్షణ అలవర్చుకునే విధంగా కృషి చేశామని తెలిపారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు క్రాంతికుమార్, షేక్.వలీమా, జయలక్ష్మి, ఎస్‌కే.బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి జోగి రమేష్ జన్మదిన వేడుకలు



కంకిపాడు/ఉయ్యూరు: రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ పుట్టిన రోజు వేడుకలు నియోజకవర్గం వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పార్టీ ఆధ్వర్యంలో ఉయ్యూరులోని వెంట్రప్రగడ బాబ్జీ ఇంటి వద్ద కేక్ కట్‌చేయించి పుష్పగుచ్ఛాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. విశ్రాంత ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్, పార్టీ యువ నేత జంపాన రవి చాక్లెట్స్‌తో ప్రత్యేకంగా తయారుచేసిన మాలతో సత్కరించి స్వాగతం పలికారు. బోళ్లపాడులో సర్పంచ్‌లు తుమ్మూరు సురేష్‌రెడ్డి, పానుగుమాటి బాలస్వామి, ఎంపీటీసీ తుమ్మూరు గంగారత్నం, పార్టీ మండల అధ్యక్షుడు దాసే రవి ఆధ్వర్యంలో జోగి రమేష్‌కు ఘన స్వాగతం పలికి సంబరాలు చేశారు. ఆకునూరులో పార్టీ నాయకులు గారపాటి నాని, ఆరేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మంత్రి జోగి రమేష్ పాల్గొని కేక్ కట్ చేశారు. కంకిపాడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో జెడ్పీటీసీ బాకీ బాబు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా గ్రామోత్సవాలు



రామవరప్పాడులో గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



నున్నలో గ్రామోత్సవం

రామవరప్పాడు: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలోని ముగ్గురమ్మలతో నిర్వహిస్తున్న గ్రామోత్సవం గత మూడు రోజులుగా కనులపండువగా జరుగుతోంది. రామవరప్పాడులో అమ్మవారి గ్రామోత్సవం పూర్తయిన తర్వాత ప్రసాదంపాడు గ్రామంలో ప్రారంభం కానుంది. అమ్మవార్ల గ్రామోత్సవం కనులారా వీక్షించేందుకు భారీ సంఖ్యలో పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. తొలుత పేరంటాలమ్మ ఆలయం నుంచి జాతీయ రహదారి మీదుగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గ్రామోత్సవం ప్రారంభమైంది. రామవరప్పాడు వీధుల్లో అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. నిరాటంకంగా జరుగుతున్న గ్రామోత్సవం ప్రస్తుతం రామవరప్పాడు హనుమాన్‌నగర్ పరిసర ప్రాంతంలో కొనసాగుతుంది. రథాన్ని భక్తులు అనుసరిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. 18వ తేదీన సాయంత్రం పేరంటాలమ్మ గ్రామోత్సవాన్ని పూర్తికానుంది. అదే రోజు రాత్రి వంతెన సెంటర్‌లోని రైవస్ కాలువలో అమ్మవార్ల తెప్పోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

నున్నలో ఉత్సవమూర్తుల గ్రామోత్సవం

నున్న(విజయవాడరూరల్): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నున్న గ్రామంలో శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి, శ్రీవేణుగోపాలస్వామి వార్ల గ్రామోత్సవం సోమవారం జరిగింది. గ్రామంలోని ప్రజలు ఉత్సవ మూర్తులను దర్శించుకొని కానుకలను సమర్పించుకున్నారు. మంగళవారం ఉదయం ఉత్సవ మూర్తులకు శ్రీచక్రస్నానం, త్రిశూల స్నానం నిర్వహించారు. కార్యక్రమంలో స్వామి అమిత్‌జీ, ఆలయ అర్చకుడు మామిళ్లపల్లి ఫణికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి అమిత్‌జీ మాట్లాడుతూ భారతదేశ సంస్కృతికి, వారసత్వానికి సంక్రాంతి పండుగ నిదర్శనమన్నారు. కుటుంబ సభ్యులందరూ కలిసి ఐక్యమత్యంగా ఉండుటకు, సంబంధాలు సుస్థిరంగా నిలవడానికి పండుగ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ఆలయాల్లో విశేష పూజలు

గన్నవరం: సంక్రాంతి వేడుకలు గన్నవరం ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల దీక్షలో భాగంగా తిరుపతమ్మ మాతృమండలి ఆధ్వర్యంలో శ్రీలలిత సహస్ర నామపారాయణం జరిపారు. పరిసరా గ్రామాల పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామివార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎస్.రామాచార్యులు నేతృత్వంలో శ్రీసీతారామచంద్రస్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అలంకరణలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు



అభయాంజనేయ స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు



విశేష అలంకారంలో శ్రీసీతారామచంద్రస్వామి వార్లు

ఘనంగా హనుమాన్ జన్మనక్షత్ర పూజలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జన్మనక్షత్రం పూర్వభాద్రను పురస్కరించుకుని మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రం సందర్భంగా ఆలయాన్ని, స్వామివారిని వివిధ రకాల పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు అభయాంజనేయస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణంలోని ఆధ్యాత్మిక వేదికపై ఆలయ అర్చకులు గొట్టిపాళ్ల శ్రీనివాసాచార్యులు, శృంగారం రామానుజాచార్యులు నేతృత్వంలో స్వామి వారి పంచలోహ విగ్రహానికి అష్టోత్తర శతకలశాలతో విశేష పూజలు, పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం దాత విష్ణువర్ధనరావు, వరలక్ష్మి దంపతులు (వైజాగ్) సహకారంతో 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

పెనమలూరు: పెనమలూరు పరిధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అవ్వటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడపకు చెందిన గంధం సాంబశివరావు ఈ నెల 14న తన అత్తగారి ఊరు గడ్డిపాడుకు బైక్‌పై వెళ్లి రాత్రి తిరిగి బయలుదేరాడు. అతను బైక్ వెనుక వేమనాథ్ కూర్చున్నాడు. వీరు గంగూరు వద్దకు వచ్చిన తరువాత రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఢీ కొట్టారు. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. బాధితుడి బంధువు బోయిన నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధుడికి గాయాలు..

పెదపులిపాక చిన్నకట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అయ్యప్పనగర్‌కు చెందిన మీర్‌కర్ణంసాహెబ్(60) బైక్ పై సోమవారం పెదపులిపాక కట్టపై వెళ్తుండగా అతనిని ఎదురుగా వచ్చిన బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతని కాలికి గాయమైంది. ఈ ఘటనపై బాధితుడి కుమారుడు షేక్ మహబూబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అయ్యప్ప ఆలయంలో మకరజ్యోతి దర్శనం



దర్శనమిస్తున్న మకరజ్యోతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం పెరికీడులో అయ్యప్ప స్వామి దేవస్థానంలో మకరజ్యోతి దర్శనం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన అన్నపూర్ణ ఏజెన్సీస్ అధినేత నూలు నరసింహారావు ఆధ్వర్యంలో ఆలయాన్ని ప్రత్యేకంగా అలకరించి, అయ్యప్పస్వామికి విశేష పూజలు నిర్వహించారు. మకరజ్యోతి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ అయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మకర జ్యోతి దర్శనానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మకరజ్యోతిని తిలకరించిన భక్తులు భక్తిపారవశ్యంతో మునిగిపోయారు. గత 26 ఏళ్లుగా నిరాటంకంగా అయ్యప్ప స్వామి దేవస్థానంలో మకరజ్యోతి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నూలు నరసింహారావును అభినందించారు. జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, గన్నవరం ఏఎంసీ మాజీ చైర్మన్ కోటగిరి వరప్రసాదరావు, స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, కానుమోలు పీఏసీఎస్ చైర్మన్ చిన్నాల సత్య గణేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు సుంకర సుభాష్‌చంద్రబోస్, వేగిరెడ్డి పాపారావు, ఎంపీటీసీ మాజీ సభ్యులు బేతాళ ప్రమీలారాణి, పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం సుబ్రమ్మణ్య స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారికి ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని స్వామి వారి ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకురాగా, ఆలయ అర్చకులు గణపతి పూజ నిర్వహించారు. అనంతరం ఉభయదాతలు, ఆలయ అర్చకులు స్వామి వారి కల్యాణోత్సవాన్ని జరిపించగా, పెద్ద ఎత్తున భక్తులు వీక్షించారు. షష్ఠి, మంగళవారం కలిసి రావడంతో స్వామి వారి కల్యాణోత్సవాన్ని వీక్షించడం అదృష్టంగా భావిస్తున్నామని పలువురు భక్తులు పేర్కొన్నారు. కల్యాణోత్సవం తర్వాత భక్తులకు తలంబ్రాలను పంపిణీ చేశారు. అనంతరం స్వామి వారి ఊరేగింపులో అర్చకులు, ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపాలెంగట్టు ప్రాంతానికి చెందిన జర్రిపోతుల జానకి, మల్లేష్ భార్యభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. మల్లేష్ అట్టపెట్టెలు తయారు చేస్తుంటాడు. కొంత కాలంగా మల్లేష్‌కు ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక మద్యం అధికంగా తాగుతున్నాడు. మంగళవారం మల్లేష్ ఇంటిలోని మైలతుత్తం అనే విషపదార్థం తిన్నాడు. దీంతో పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రాజ్యాంగ నిర్మాతకు సముచిత గౌరవం

వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రామస్వామి

లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సముచిత గౌరవం కల్పించారని వాణిజ్య పన్నులశాఖ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వట్టిపల్లి రామస్వామి పేర్కొన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ విజయవాడకే ఐకాన్‌లా నిలిచేలా విగ్రహం, గ్రీనరీ, మ్యూజియం వంటివి ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమన్నారు. ఇదోక పర్యాటక ప్రాంతంగా రూపొందుతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విషయంలో ఇంతటి గొప్ప నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఈ నెల 19న వేడుకలా నిర్వహించే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు, ఉద్యోగులు, అంబేడ్కర్ అభిమానులు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల ఎత్తుగల విగ్రహాన్ని ఈ నెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న దృష్ట్యా దళిత సామాజికవర్గం పెద్ద ఎత్తున తరలి రావాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు కాలే పుల్లారావు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా సుమారు రూ.400 కోట్ల వ్యయంతో విజయవాడ నడిబొడ్డున స్వరాజ్యమైదానంలో నిర్మించిన అంబేడ్కర్ స్మృతివనం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ అంబేడ్కర్ స్మృతివనం ప్రపంచం గర్వపడే విధంగా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దటం సీఎం జగనన్న ప్రభుత్వానికే సాధ్యమైందని చెప్పారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తరలి వచ్చి అంబేడ్కర్‌కు నివాళులర్పించాలని కోరారు. అంబేడ్కర్ ఆలోచనా విధానంతో పరిపాలన సాగిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అనేక విధాలుగా మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అంబేడ్కర్ విగ్రహ కమిటీ చైర్మన్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జునలకు ఐదు కోట్ల ఆంధ్రుల తరుపున అభినందనలు తెలియజేస్తున్నామన్నారు.

భారీగా మద్యం బాటిళ్ల స్వాధీనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వేర్వేరు చోట్ల 239 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 219 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందింది. దీంతో సెక్టార్ ఎస్ఐ జాన్‌బాషా కాలనీలో తనిఖీలు నిర్వహించగా, ఉప్పలపల్లి దుర్గాప్రసాద్(21), మల్లెల చెన్నారెడ్డి(30) మద్యం నిల్వ ఉంచినట్లు గమనించారు. వీరిని అరెస్టు చేసి 219 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. చిట్టినగర్‌లో మరో చోట మద్యం అక్రమంగా నిల్వ చేసిన వాండ్రెపు వెంకట సత్యనారాయణ(48)ను అరెస్టు చేసి అతని నుంచి 20 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు.

డైరీ ఆవిష్కరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): శివతీర్థ చారిటబుల్ ట్రస్ట్ డైరీని మంగళవారం చుట్టుగుంట దుర్గాదేవి ఆలయంలో వేద పండితులు బాల శివశంకర్ శర్మ, ప్రకాష్, శివ సమక్షంలో సెంట్రల్ నియోజకవర్గం యాదవ సంఘం అధ్యక్షుడు, 26వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అంగిరేకుల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.